



# పాపం అప్పారావ్

సుబ్రహ్మణ్యం

సాయంత్రం ఐదు గంటలవుతోంది. రోజల్లా దహించిన ఎండ అప్పుడే క్రమంగా చల్లబడుతోంది. సంధ్యా సమయం దగ్గరవుతున్నకొద్దీ, అప్పటిదాకా నిప్పులు చెరిగిన సూర్యుడు హీరో చేతుల్లో దెబ్బలు తిన్న విలన్‌లా పాలిపోతున్నాడు. దూదిపింజల్లా మబ్బులు ఆకాశంలో తేలియాడుతున్నాయి.

అప్పారావ్ అప్పుడే పంపుక్రింద చన్నీళ్ళ స్నానం ముగించుకొని గదిలోనికొచ్చాడు. తర్వాత పెట్టెలోంచి ఇస్త్రీ చేసిన మల్లెపువ్వులాంటి ప్యాంటూ, షర్టూ వేసుకుని "టినోపాల్ మ్యాన్" గా తయారయి వచ్చాడు. అద్దంముందు నిలబడి తనను తానే చూసుకొని మురిసిపోతున్న అప్పారావు చేతిలోని

మువ్వైన వంకీజుత్తుపై వింతగా నాట్యం చేస్తోంది.

ముచ్చటగా నిండు పాతికేళ్ళ ప్రాయంలోవున్న అప్పారావు కింకా పెళ్ళికాలేదు. ఉద్యోగ రీత్యా హైదరాబాదులో ఉంటున్నాడు. సంపాదించే జీతం రాళ్ళు ఎక్కువే అయినా, డబ్బంటే పంచప్రాణాలు అప్పారావుకి. అందుకే సిటీలోని మారుమూల ప్రాంతంలో ఒక చిన్న గదిని అద్దెకి తీసుకొని ఎలాగో నెట్టుకొస్తున్నాడు. గది చీకటి గుహలా వున్నా అద్దె తక్కువేగదా అన్న అభిప్రాయంతో ఆ గదినే అంటిపెట్టుక్కూచున్నాడు. పేరుకి అప్పారావే అయినా అప్పులు యివ్వడమన్నా, పుచ్చుకోవటమన్నా పరమ రోత అతగాడికి. అందుకే మహామహా అప్పులరావులు కూడ అతన్ని డబ్బడగటానికి జంకుతారు. డబ్బు విషయంలో యింత పొదుపరి అయినా అప్పారావుకి సినిమా పిచ్చి అనేది కాస్త ఎక్కువనే చెప్పాలి. నెలకి రెండు మూడు సినిమాలయినా విధిగా చూస్తాడతను. అదీ తనొక్కడే వెళ్తాడు.

తల దువ్వుకుని అప్పారావు చేతికి వాచీ కట్టుకున్నాడు. అక్కడే టేబులుపై పడివున్న దినపత్రికను చేతిలో తీసుకుని ఎక్కడెక్కడ ఏయే సినిమాలాడుతున్నాయో శ్రద్ధగా చూసాడు. సడన్‌గా అతనిదృష్టి వారం రోజుల క్రితమే విడుదలయిన ఒక తెలుగు సినిమా అడ్వర్టయిజ్‌మెంటుపై పడింది. కొంతసేపు కళ్ళు పొడుచుకుని చూసిన తర్వాత ఆ సినిమాకే వెళ్ళాలని నిశ్చయించుకున్నాడు. ఆట 6 గంటలకే ప్రారంభం అని పేపర్లో రాసివుంది. అప్పారావు వాచీ చూసుకున్నాడు. గడియారం ఐదు గంటల ఇరవై నిమిషాలని చూపుతోంది. సినిమాకి టైమవుతోందన్న ఆత్రంలో పర్సు జేబులో వేసుకుని అదరాబాదరాగా గదికి తాళం వేసి త్వరత్వరగా నడక ప్రారంభించాడు.

అప్పారావు యింటినుంచి బస్‌స్టాప్ కొంచెం దూరమనే చెప్పాలి. బస్సు స్టాపుదాకా నడిచివెళ్ళి తర్వాత బస్సెక్కవచ్చు లెమ్మనుకున్నాడు. త్వరత్వరగా నడచి బస్‌స్టాప్‌ను చేరుకున్నాడు. ఇంతలో బస్సు వచ్చింది. కాని నల్లదూరేంత సందుకూడ లేకుండా ప్రయాణీకులు నిండివుండటంతో కండక్టరు బస్ నిలుపకుండా బెల్ కొట్టేశాడు. అప్పారావుకి కండక్టరు పీక నులిపేద్దామా అన్నంతకోపం వచ్చింది. "వీడిసిగదరగ! బస్సు నిలిపితే వీడి సొమ్మేం పోయింది?" అనుకున్నాడు కసిగా. పోనీ తనకయినా రన్నింగ్ బస్సెక్కటం చేతకానందుకు తనను తాను తిట్టుకున్నాడు.

విసుక్కుంటూ ప్రక్కనే ఉన్న కిళ్ళీ దుకాణం వైపు దారి తీసాడప్పారావు. ఐదు రూపాయల నోటిచ్చి చార్మినార్ సిగరెట్ ప్యాకెటు ఒకటి,

అగ్గిపెట్టె ఒకటి కొన్నాడు. అంగడి వాడు తిరిగిచ్చిన డబ్బుని తీసుకుని లెక్కపెట్టుకుంటూండగా ఇంకో బస్సు వచ్చింది. ఆ బస్సయినా అందకుండా పోతుందేమోనని త్వరగా డబ్బును లెక్క చూసుకోకుండా జేబులో వేసుకుని పరిగెడుతూ బస్సుస్టాపు దగ్గరకొచ్చాడు. కానీ ఆ బస్ కూడా ఆగకుండా వెళ్ళిపోవడంతో అప్పారావుకి చెప్పలేనంత కోపం వచ్చింది. విసుగ్గా వాచీ చూసుకున్నాడు. వాచీలో గడియారం ముల్లు ఐదు గంటల నలభయి నిమిషాలని వెక్కిరిస్తూన్నట్లనిపించింది తనికి. అప్పారావుకి కాళ్ళమీదఉన్నట్టుంది. అప్పారావుకి క్షణక్షణానికీ అసహనం పెరిగి పోతోంది. ఇవ్వాళెలాగయినా సినిమా చూడాలనుకున్నాడు. ఇంత దూరం వచ్చి తిరిగి యింటికెళ్ళడానికిమనస్కొప్పలేదు. కొంతమంది రిక్షావారిని పిలిచి చూశాడు. కాని వారంతా విపరీతంగా ధర చెప్పడంతో రిక్షాలోపోయే ప్రసక్తి విరమించుకున్నాడు.

ఇంతలో "రిక్షాకావాలా? బాబూ!" అని గొంతొకటి వినిపించింది. అప్పారావు తలెత్తి చూశాడు. గుంటలుపడ్డ కళ్ళతో ముసలివాడొకడు తనవైపే ఆశతో చూస్తున్నాడు. వాడి జుత్తంతా పండినట్టు బాగా నెరిసి పోయింది. ముసలితనంవల్ల ముడతలుపడ్డ చర్మం వికృతంగా మడతలు పడి బట్టలా కట్టెపుల్లలాంటి శరీరాన్ని చుట్టుకుని వ్రేలాడుతూతోంది. అస్థిపంజరంలా ఉన్న అతని శరీరంలో ఎముకలు స్పష్టంగా కన్పిస్తున్నాయి.

"ఎక్కడికి వెళ్ళాలి? బాబూ!" మళ్ళీ ముసలాడే అడిగాడు.

అప్పారావు వెళ్ళాల్సిన థియేటర్ పేరుచెప్పి ఎంత తీసుకుంటావని అడిగాడు.

"పదణాలు యిప్పించండి" రిక్షావాడు ధర చెప్పాడు.

"ఆరణాలిస్తాను. వస్తేరా" అప్పారావుకి పదణాలిచ్చి రిక్షాలో వెళ్ళడం యిష్టంలేదు.

"పోనీ ఎనిమిదణాలు యిప్పించండి, వస్తాను. అంతకంటే తక్కువ లేదు" అన్నాడు రిక్షావాడు వెళ్ళిపోబోతూ.

ఆ ధర సమ్మతం కానట్టు తలూపాడు అప్పారావు. ఇంతలో బస్సు రాకపోతుందా? అనుకొని బస్సుకోసం ఎదురు చూడసాగాడు కాని అనుకున్న ప్రకారం బస్సు వచ్చే సూచన లేవీ కనిపించలేదు. అటు సినిమాకికూడ వేళయిపోతోంది. ఇంకా పదినిమిషాలే ఉంది. బస్సుపై ఆశ వదులుకున్న

---

"మీ ఆవిడ చాలా పొదుపరి అని విన్నాను?"

దా: (అవును) నిన్న తన నలభైయ్యవ పుట్టిన రోజు పండుగకి 28 వత్తులు మాత్రమే పెట్టింది.

అప్పారావు అయిష్టంగానే వెళ్ళిపోబోతున్న రిక్షావాడిని వెనక్కి పిలిచాడు. అప్పారావు కేక విని ముసలివాడు రిక్షాని వెనక్కి త్రిప్పుకొని వచ్చాడు.

"సరే. నీ ప్రకారమే ఎనిమిదణాలకు పద" అన్నాడు అప్పారావు రిక్షాలో ఎక్కి కూర్చుంటూ, "కానీ త్వరగా వెళ్ళాలి తెలిసిందా ?" అని ఆజ్ఞాపిస్తున్న ధోరణిలో.

"అల్లాగే బాబూ !" అంటూ రిక్షావాడు త్వరగా త్రొక్కడం ప్రారంభించాడు.

"ఆలస్యమైపోతోంది. ఇప్పటికే బుకింగ్ అయిపోయిందేమో" అనుకున్నాడు అప్పారావు. చార్మినార్ సిగరెట్ ఒకటి అంటించి తీరిగ్గా పొగల్ని రింగులు రింగులుగా వదులుతూ ఆలోచించసాగాడు. "వీడే నయం. మిగతా రిక్షావాళ్ళ యింకన్న యెక్కువ అడిగాడు" అనుకున్నాడు మనసులో.

ఇంతలో థియేటర్ దగ్గర రిక్షా నిలచింది. అప్పారావు రిక్షానించి దిగి జేబులోంచి ఒక అర్ధరూపాయితీసి రిక్షావాడికిచ్చాడు. థియేటర్లోకి వెళ్ళబోయిన వాడల్లా "ఈ అర్ధరూపాయి చెల్లదు బాబూ !" అన్న రిక్షావాడి పిలుపుకి వెనుతిరిగి చూశాడు. అప్పారావు అర్ధరూపాయిని చేతిలో తీసుకొని చూశాడు. నిజమే ! అది ఒక వైపు పూర్తిగా అరిగిపోయి వుంది.

అప్పారావుకి చెప్పలేనంత ఆశ్చర్యం, కోపం ఒకేసారి కలిగాయి. ఈ చెల్లని అర్ధరూపాయి ఎలా వచ్చిందిచెప్మా ? అని అనుకున్నాడు. ఇంతలో తాను బస్ వచ్చేటప్పుడు కిళ్ళీ దుకాణం వాడిచ్చిన చిల్లర డబ్బులు సరిగా చూసుకోనకుండా జేబులో వేసుకుని పరుగెత్తిన సంగతి గుర్తొచ్చింది. తననే మోకరా తినిపించిన కిళ్ళీ దుకాణంవాణ్ణి తిట్టుకుంటూ, అప్పారావు వేరే అర్ధరూపాయిచ్చి రిక్షావాణ్ణి పంపేశాడు.

ఇంతా చేసి, అప్పారావు థియేటర్లోకెళ్ళేసరికే బుకింగ్ మూత పడింది. అప్పుడే థియేటర్లో "న్యూస్ రీల్" కాబోలు వేస్తున్నారు. ఎంతో కష్టపడి సినిమాకొస్తే యిలా కావటం అప్పారావుకి చాల కోపం తెప్పించింది. ఇక చేసేదేమీ లేక అతను థియేటర్ లోంచి బయటికి వచ్చి నడిచి పోసాగాడు.

పరధ్యానంగా నడుస్తున్న అప్పారావుకి యింతలో "టిక్కెట్ కావాలా బాబూ !" అని కేక వినిపించింది.

అప్పారావు తలెత్తి చూశాడు. థియేటర్ దగ్గరే పాతికేళ్ళ కుర్రాడొకడు ఒకే ఒక టిక్కెట్టు పట్టుకొని నిలబడున్నాడు. టిక్కెట్టు చూడగానే పోయిన ప్రాణాలు లేచివచ్చినట్లనిపించింది అప్పారావుకి.

"ఎంత టికెట్టు ?" అని అడిగాడు.

"సెకెండ్ క్లాస్ టిక్కెట్టు రూపాయి ముప్పయి పైసలది ఒకటే ముప్పావలాకు అమ్ముతున్నాను, బాబూ ! ఇది

మాత్రమే మిగిలిపోయింది" అన్నాడా కుర్రాడు.

కొందామా? వద్దా? అన్న మీమాంసలోపడ్డ అప్పారావుకి ఇంతలో మెరపులాంటిఆలోచన ఒకటి తట్టింది. "సరే ఆ టికెట్టిలాయిప్పు" అంటూ ఆ టికెట్ తీసుకుని, పైకం వాడి చేతిలో పెట్టాడు. కుర్రాడా పైకాన్ని ఒకమారు చూసుకొని, జేబులో వేసుకుని త్వరగా మాయమయ్యాడు. దూరంగా నడచి వస్తున్న పోలీసును చూసింతర్వాత ఆ కుర్రా డెందుకలా త్వర త్వరగా వెళ్ళిపోయాడో అర్ధమయింది.

"చెల్లని అర్ధరూపాయిని టికెట్ డబ్బుల్తోపాటు కలిపి కుర్రాడికంటకట్టినందుకు తనను తానే అభినందించుకుంటూ అప్పారావు థియేటర్‌లోకి దారితీసాడు.

సెకెండ్‌క్లాస్ ద్వారంవద్ద ఉన్నతనికి టిక్కెట్టు యిచ్చి, అప్పారావు లోనికెళ్ళబోయాడు. కాని "ఏమ్ మిష్టర్!" అన్న గేట్ కీపర్ కేకతో వెనుదిరిగి చూచాడు.

"ఈ టిక్కెట్టు చెల్లదు" అంటూ ఆ టిక్కెట్ అప్పారావు చేతికిచ్చాడు గేట్‌కీపర్.

"ఏం?" అప్పారావు తనని తాను నమ్మనట్లు చూశాడు.

"మమ్మల్నే మోసం చేద్దామనుకుంటున్నావా? ఈ ఎర్ర రంగు టిక్కెట్టు నిన్నటిది. చదువుకున్నవాడివే ఇలాచేస్తే ఎలా, మిష్టర్?' అన్నాడు గేట్ కీపర్ గద్దిస్తున్నధోరణిలో, టిక్కెట్టును మిగతా గేట్‌కీపర్లకు చూపెడుతూ.

"ఏమిటో ఈ కాలమంతా యిట్లయిపోతున్నాది: ఎవర్నీ నమ్మడానికి వీలేకుండా ఉంది" మిగతా గేట్‌కీపర్లు వంతపాడారు.

అసలే మిన్నువిరిగిమీద పడ్డట్టయిన అప్పారావుకి, యిక అక్కడేవుంటే వసువుకూడా దక్కదేమో అన్న భయంకూడా పట్టుకుంది. వెనక్కికూడా తిరిగి చూడకుండా అప్పారావు త్వర త్వరగా అడుగులేస్తూ థియేటరు బయటికొచ్చాడు. తనను దగాచేసిన ఆ కుర్రాడు కనిపించకపోడా అన్న ఆశతో. కాని అతని ఆశ నిరాశ అయింది.

అప్పుడు గుర్తుకొచ్చింది అప్పారావుకి, తాముకొన్న టిక్కెట్టు క్రితంరోజు బ్లాక్‌లో అమ్ముడుపోక మిగిలిపోయిన టిక్కెట్ అయివుంటుందని. కసితీరా ఆ టికెట్‌ని ముక్కలు ముక్కలుగా చించి పారేశాడు అప్పారావు.

నేలమీద చిరిగిపోయిన టికెట్ తనని "పాపం! అప్పారావు!" అని వెక్కిరిస్తున్నట్లనిపించిందతనికి.

•••